క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. కులీకుతుబ్ షా స్టేడియం, ఘాన్సీబజార్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఏఐసీసీ స్పోక్స్ పర్సన్ సుప్రియశ్రీకి స్వాగతం పలికిన నేతలు



అబిడ్స్: ఏఐసీసీ స్పోక్స్ పర్సన్ సుప్రియశ్రీ కి గోషామహాల్ నియోజకవర్గానికి చెందిన పీసీసీ కార్యదర్శి నిర్మల్‌కుమార్ యాదవ్ ఘన స్వాగతం పలికారు. గాంధీభవన్‌కు వచ్చిన సుప్రియశ్రీని ఈ సందర్భంగా సన్మానించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గోల్కొండ: ట్రాఫిక్ నిబంధనలను పాటించడంతోపాటు వాహనాలను నిషేధిత ప్రాంతాల్లో పార్కింగ్ చేయరాదని టోలీచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. వాహనం నడిపేవారు తమ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధృవపత్రాలను వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

మహిళా సాధికారతపై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారు



హాజరైన వివిధ రంగాల ప్రముఖ మహిళలు

చార్మినార్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ ఆధ్వర్యంలో శనివారం చాంద్రాయణగుట్ట గ్రేస్ ఫంక్షన్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ పర్యవేక్షణలో మహిళా సాధికారిత అనే అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రముఖులు, అధికారులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు సీడీపీఓ జ్యోత్స్న, సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారు మాట్లాడారు. మహిళలు రాజ్యాంగం కల్పించిన తమ హక్కులను తెలుసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. యూపీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బేగం, ప్రముఖ మహిళా ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు సదాలక్ష్మి, వీరమణి, విజయశ్రీ తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

నేటి మహిళకు ఎదురు లేదు



ప్రశంసా పత్రం అందిస్తున్న నటి హిమజ

గోల్కొండ: నేటి ప్రపంచంలో మహిళలకు ఎదురేలేదని వర్ధమాన నటి హిమజ అన్నారు. శనివారం ఆమె నానల్‌నగర్ మామ్ ఐవీఎఫ్ సెంటర్‌లో ఉత్తమ మహిళా ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు.సీఈఓ డాక్టర్ పూర్ణిమ దుర్గ, మెడికల్ డైరెక్టర్ హరిచారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను బర్తరఫ్ చేయాలి

నాంపల్లి: మద్యం మాఫియాలో ఇరుక్కున్న ఎమ్మెల్సీ కవితను వెంటనే ఎమ్మెల్సీ పదవి నుండి బర్తరఫ్ చేయాలని ఓయూ జేఏసీ, టీజేపీపీ డిమాండ్ చేశాయి. శనివారం నాంపల్లిలోని గన్‌పార్కు ఎదుట ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేస్తూ ఓయూ జేఏసీ నేతలు భట్టు శ్రీహరి, నవీన్ యాదవ్, టీజే పీపీ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ప్రశాంత్ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ ఎన్నో అవినీతి అక్రమాలకు పాల్పడి తెలంగాణ మహిళల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా ఎమ్మెల్సీ కవిత ప్రవర్తించారని ఆరోపించారు.



గన్‌పార్కు ఎదుట నిరసన తెలియజేస్తున్న దృశ్యం

మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం



నీటి సమస్యను తెలుసుకుంటున్న కార్పొరేటర్

సుల్తాన్‌బజార్: జాంబాగ్ డివిజన్‌లో లోప్రెషర్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. డివిజన్‌లోని బారాదరి కాలనీలో లోప్రెషర్ నీటి సమస్యను ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో శనివారం జలమండలి అధికారులతో కలిసి సమస్యను పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు.

రోడ్డు నియమాలపై అవగాహన

బంజారాహిల్స్: జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా బంజారాహిల్స్‌లోని శ్రీకృష్ణ గ్రూప్ ఉద్యోగులు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోషల్ డ్రైవ్ పేరుతో శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. హెల్మెట్ ధరించడంతో పాటు సీటు బెల్టు పెట్టుకోవాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడుపరాదని వాహన చోదకులకు సూచించారు. ఈ సందర్భంగా భద్రతా సూచిక బోర్డులు, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. శ్రీకృష్ణ గ్రూప్ తొలిసారిగా ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని నిర్వహించిందని గ్రూప్ సీహెచ్ఆర్ఓ రాజ్ చౌహాన్ తెలిపారు.

ముదుఘంటికలు పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి, ఏనుగు నర్సింహారెడ్డి

నాంపల్లి: కాళోజీ, సినారె పురస్కారాల గ్రహీత డాక్టర్ సుధాకర్‌రెడ్డి రచించిన 'ముదుఘంటికలు' పుస్తకావిష్కరణ సభ శనివారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఏసీగార్డ్స్‌లోని వఫీజ్ రెసిడెన్సీలో జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కార గ్రహీత ముదిగంటి సుజాతా రెడ్డి, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంస్థ కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గోల్కొండ: సీఎంఆర్ఎఫ్ పథకం పేద కుటుంబాలకు వరం వంటిదని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకిలోని మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో రూ.1.52 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. అవసరమైన వారు అన్ని ధృవపత్రాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే ఆ దరఖాస్తులకు తప్పకుండా ఆమోదం లభిస్తుందన్నారు.



లబ్ధిదారుడికి చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

ఆడిపాడిన విద్యార్థులు



విద్యార్థుల నృత్యప్రదర్శన

గోల్కొండ: విద్యార్థులను చదువులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు పై కూడా శ్రద్ధ కనబర్చాలని విజన్ స్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ ఏఎంఎస్ రాణి అన్నారు. విజన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మహ్మద్ ఖలీక్ ఉర్ రహమాన్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉత్తమ భావి పౌరులుగా తీర్చిదిద్దవలసింది ఉపాధ్యాయులేనని అన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత



నవనీతను సన్మానిస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అనన్య ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నవనీత అన్నారు. శనివారం రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో సేవలందిస్తున్న పలువురు మహిళలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రతి బాలిక విద్యను అభ్యసించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: నేటితరం మహిళలు ఝాన్సీ లక్ష్మీబాయిని స్ఫూర్తిగా తీసుకోవాలని న్యాయాధికార సేవా సంస్థ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగీత నృత్య ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలకు ఝాన్సీ లక్ష్మీబాయి వీరవనిత పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... సమాజంలో వివక్ష, వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు ఝాన్సీ లక్ష్మీబాయిలా తెగువ చూపాలని సూచించారు. అంతకు ముందు కళాకారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో పలువురు టీవీ నటులు, భారత్‌ఆర్ట్స్ వ్యవస్థాపకులు లయన్ కేవీ.రమణారావు, ఏబీసీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లలిత తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



బహదూర్‌పురా: జహనుమా బాయ్స్‌టౌన్ స్కూల్‌లో ముగ్గురు ఉపాధ్యాయుల పదవీ విరమణ సందర్భంగా విద్యార్థులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో బాయ్స్‌టౌన్ డైరెక్టర్ బ్రదర్ యేసు ప్రభాహరన్, ప్రిన్సిపాల్ శౌరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జయబాలన్ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానిస్తూ వీడ్కోలు పలికారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

సమాజ సేవతో ఎంతో తృప్తి

మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి



మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: సమాజ సేవ చేయడంలోనే మనిషికి ఎంతో తృప్తి, ఆనందం లభిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆగాపురాలో డాక్టర్ మెట్టు శ్రీకాంత్ నిర్వహించిన చంద్రావతి మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మానవసేవే మాధవ సేవ అనే తరహాలో డాక్టర్ మెట్టు శ్రీకాంత్, మెట్టు రాఘవేందర్, మెట్టు విజయ్‌కుమార్ సమాజ శ్రేయస్సుకు చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మేకపాటి రాజమోహన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు, స్థానికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, బ్రషులు, పేస్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతీయ ఫిషర్‌మెన్ కమిటీ చైర్మెన్ మెట్టు ప్రసాద్, ఏసీపీలు సతీష్ కుమార్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



కార్పొరేటర్ రాషెద్ ఫరాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: నియోజకవర్గంలో షేక్‌పేట్ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నానని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని కోహెన్సర్ కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీడీసీసీ రోడ్డును పరిశీలించారు. కోహెస్సార్ కాలనీలో పార్కుకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు.

కూలర్ల తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం



బహదూర్‌పురా: తాడ్‌బన్ అన్సారీ రోడ్డులోని ఓ కూలర్ల తయారీ కేంద్రంలో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు...తాడ్‌బన్ అన్సారీ రోడ్డులోని ఓ కూలర్ల తయారీ కేంద్రంలో శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే నాలుగు ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్లాస్టిక్, గడ్డి, ఇతరత్రా వస్తువులు ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదంలో ఎంత ఆస్తినష్టం జరిగిందనే విషయంపై పోలీసులు అంచనా వేస్తున్నట్లు కాలాపత్థర్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య తెలిపారు.

ఫ్లెక్సీ ధ్వంసం..కేసు నమోదు

గోల్కొండ: షేక్‌పేట్ నక్కబాయ్ సొసైటీ స్కూల్ వద్ద రైజ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. పాఠశాలలో మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇందులో భాగంగా స్కూల్ ప్రాంగణంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే శుక్రవారం రాత్రి కొందరు రెండు ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. ఈ విషయం పై నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు శ్రావణ్ అనే యువకుడితో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

భార్యపై అనుమానంతో హత్య

బహదూర్‌పురా: భార్యపై అనుమానంతో కర్రతో దాడి చేసి హత్య చేసిన సంఘటనలో భర్తను బహదూర్‌పురా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన మేరకు.. ఫుట్‌పాత్‌పై నివాసముండే తుల్జప్ప, సోని అలియాస్ అనిత (40) పురానాపూల్ వైన్‌షాపులో సీసాలు పోగు చేసుకొని విక్రయిస్తూ ఫుట్‌పాత్‌పై జీవనం కొనసాగిస్తున్నారు. అయితే అనితకు ఇతరులతో వివాహేతర సంబంధం ఉందని భర్త అనుమానించేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి పురానాపూల్ దర్గాలోని గుడిసెలో అనిత నిద్రిస్తుండగా తలపై కర్రతో దాడి చేసి హత్య చేశాడు. ఉదయం సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ జరిపి తుల్జప్పను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

గోవధ నిషేధ చట్టం తీసుకురావాలి

లిబర్టీ: గోవధను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని భారతీయ ధార్మిక సేవా సమితి అధ్యక్షుడు కేపీఎస్ శర్మ విజ్ఞప్తి చేశారు. సమితి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా గోవధను నిషేధిస్తూ పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

బండి సంజయ్‌పై ఫిర్యాదు

చాంద్రాయణగుట్ట: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీనియర్ నాయకుడు సభావత్ గిరిధర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన ఫిర్యాదు చేశారు.

ఛత్రినాకలో..

బీఆర్ఎస్ ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్.. బండి సంజయ్‌పై ఛత్రినాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంజయ్ ఇష్టానుసారంగా మాట్లాడితే తమ సత్తా చూపిస్తామన్నారు.

మీర్‌చౌక్‌లో..

చార్మినార్: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు.



ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గిరిధర్ నాయక్



మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భారతీయ సంస్కృతిపై మక్కువ పెంచాలి





కార్యక్రమంలో మాట్లాడుతూ ఏసీపీ శంకర్‌రాజు

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్ శిక్షణాకేంద్రం ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. శనివారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో నందిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్రకూడా ఎంతో కీలకమన్నారు. స్కూల్ కార్యదర్శి నర్సింహులు, అధ్యక్షుడు ప్రహర్ష పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న మురుగుతో ప్రజల ఇక్కట్లు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మురుగునీరు పొంగిపొర్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డివిజన్‌లోని పూలబండ, వీరాంజనేయ దేవాలయం, లాల్‌పాషా మసీదు, పంచముఖి హనుమాన్ దేవాలయం తదితర బస్తీల్లో కొద్ది రోజులుగా ఈ సమస్య నెలకొంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా... పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ఇళ్ల మధ్యలో పొంగిపొర్లుతున్న మురుగునీరు